అక్కచెల్లెమ్మలకు అండగా ఉన్నది జగనే..



ఆసరా సంబరాలకు భారీ సంఖ్యలో హాజరైన మహిళల్లో ఒక భాగం



పొదుపు సంఘాలకు రుణమాఫీ చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రిదే..
- వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి
- 5,492 పొదుపు సంఘాలకు రూ.38.06 కోట్ల రుణ మాఫీ
- పండగలా వైఎస్సార్ ఆసరా సంబరాలు



డ్వాక్రా స్టాల్‌ను పరిశీలిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

గాజువాక : రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలకు అండగా ఉన్నది ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని మర్చిపోకుండా అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. గాజువాకలో శుక్రవారం నిర్వహించిన 4వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని 5,492 స్వయం సహాయక సంఘాలకు చెందిన 56,040 మంది మహిళలకు రూ.38,06,93,095 రుణమాఫీ చెక్కును అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

నాలుగు విడతల్లో రూ.130 కోట్ల రుణమాఫీ

సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి చంద్రబాబు అక్క చెల్లెమ్మలను, రైతులను ఘోరంగా మోసం చేశారన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు విడతల్లో అక్కచెల్లెమ్మలకు రుణాలను పూర్తిగా మాఫీ చేసి న్యాయం చేశారన్నారు. గాజువాక నియోజకవర్గంలో రూ.130 కోట్లు మాఫీ చేశారన్నారు. పేదలు ఎక్కడున్నా వారికి సంక్షేమ పథకాలను అవినీతికి తావు లేకుండా అమలు చేశారన్నారు. భావి తరాలకు ఉపయోగపడే విధంగా పథకాలను అమలు చేశారన్నారు. ఎంత ఖరీదైనా విద్య, వైద్యం అందిస్తున్నారన్నారు. 2014లో పసుపు, కుంకుమ వంటి మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మహిళలను ఘోరంగా మోసం చేశారని, ఇప్పుడు అదే డ్రామా కంపెనీ మళ్లీ మోసానికి తెర తీసిందని అన్నారు. జగన్‌ను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతో అమలు కాని హామీలను ఇస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్, ఇతరులను కూడా తిప్పి కొట్టాలని కోరారు.

కోటి 15 లక్షల కుటుంబాల్లో వెలుగులు

రాష్ట్రంలో కోటి 65 లక్షల కుటుంబాలుంటే కోటి 15 లక్షల కుటుంబాల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి వెలుగులు నింపారన్నారు. అందుకోసం ఆయనకు అందరూ మరోసారి అండగా నిలవాలని కోరారు. జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవడం కోసం గాజువాకలో ఉరుకూటి చందును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు రాజాన రామారావు, కేబుల్ మూర్తి, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు మంత్రి రాజశేఖర్, గుడివాడ లతీష్, కోమటి శ్రీనివాసరావు, రాజాన వెంకటరావు, బొడ్డ గోవింద్, రెడ్డి జగన్నాథం, ఉరుకూటి అప్పారావు, మద్దాల అప్పారావు, పల్లా చినతల్లి, యువశ్రీ, దొడ్డి రమణ, సిరట్ల శ్రీనివాస్, మొల్లి చిన్న, మంత్రి శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బేకరీ ఫుడ్స్ తయారు చేస్తున్నా



మాది శ్రీలక్ష్మీ నర్సింహ మహిళా పొదుపు సంఘం. డ్వాక్రాలో తీసుకున్న రుణంతో బేకరీ ఫుడ్స్ తయారీ చేస్తున్నాను. నాతోపాటు మరో ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నాను. డ్వాక్రా రుణంతో ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఏర్పడింది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన వైఎస్సార్ ఆసరా పథకంలో మా పొదుపు సంఘానికి రూ.2.25 లక్షల రుణమాఫీ చేశారు. చాలా సంతోషంగా ఉంది.

– ఎం.అనూరాధ, అశోక్‌నగర్

పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమ నెలకొల్పాం



డ్వాక్రా ద్వారా మంజూరు చేసిన రుణంతో మేము పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమను నెలకొల్పాం. అందరం పని చేస్తాం నాణ్యతతో కూడిన ప్లేట్లు తయారు చేస్తుండటంతో చాలామంది మా షాప్ వద్దకు వచ్చి ఆర్డర్లు ఇస్తుంటారు. పెట్టుబడి సమస్య వచ్చినప్పుడు డ్వాక్రా రుణం ఆదుకుంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాకు రుణ మాఫీ చేయడంతో ఆర్థికంగా ఆసరా లభించింది. ఆయనకు రుణపడి ఉంటాం.

– గొరుసు వరలక్ష్మి, సిద్ధేశ్వరం

వస్త్ర సంచులు సరఫరా చేస్తున్నాం



మాది శ్రీలక్ష్మి మహిళా పొదుపు సంఘం. మా సంఘానికి ఇప్పటివరకు రూ.4.38 లక్షల రుణమాఫీ చేశారు. మా సంఘానికి వచ్చిన రుణంతో గుడ్డ సంచులను తయారు చేసి వివిధ దుకాణాలకు సరఫరా చేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే విధంగా సంచులను నాణ్యతతో తయారు చేసి ఇస్తున్నాం. డ్వాక్రా రుణంతో ఈ పని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. మేం చేసిన పనికి తగిన గుర్తింపు కూడా లభిస్తోంది. డ్వాక్రా సంఘాల రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– ఎస్.లక్ష్మి, అక్కిరెడ్డిపాలెం

సొంత సంపాదనతో జీవిస్తున్నా..



మాది రోజ్ మహిళా పొదుపు సంఘం. నాకు భర్త లేరు. ఆర్థికంగా ఇబ్బంది ఉండేది. డ్వాక్రా రుణంతో నేను టైలరింగ్ ప్రారంభించాను. దీంతో నేను సొంతంగా సంపాదించుకుని సంతోషంగా జీవిస్తున్నాను. ముఖ్యమంత్రి అమలు చేసిన రుణమాఫీ వల్ల మా సంఘానికి రూ.2.25 లక్షలు మాఫీ అయ్యింది. డ్వాక్రా రుణంతో కుట్టు మెషీన్‌ను కొనుగోలు చేసుకున్నాను. రుణ మాఫీ వల్ల పెట్టుబడి ఉచితంగా వచ్చినట్లయింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

– దిల్‌షాద్, అజీమాబాద్ కాలనీ

క్లుప్తంగా


జెడ్సీ ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ



జెడ్సీ ప్రసాదరావు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌గా పీవీవీడీ ప్రసాదరావు శుక్రవారం బాధ్య తలను స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన జోనల్ కమిషనర్ పి.సింహాచలం పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో విజయనగరం మున్సిపాల్టీలో అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న ప్రసాదరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా జోనల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది బదిలీపై వెళ్లిన సింహాచలంకు ఘనంగా వీడ్కోలు పలికి.. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావుకు స్వాగతం పలికారు. వివిధ సంఘాల నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దువ్వాడ సీఐగా ఎర్రంనాయుడు



సీఐ ఎర్రంనాయుడు

కూర్మన్నపాలెం: దువ్వాడ సీఐగా ఎర్రంనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో దువ్వాడ సీఐగా ఉన్న శ్రీనివాసరావును నగరంలోని డీఐజీ కార్యాలయానికి బదిలీ చేయగా.. న్యూపోర్టు సీఐగా ఉన్న ఎర్రంనాయుడును దువ్వాడ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ సందర్భంగా ఎర్రంనాయుడు మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.

సౌత్ ట్రాఫిక్ సీఐగా నాగరాజు



సీఐ నాగరాజు

విశాఖపట్నం సౌత్ ట్రాఫిక్ సీఐగా వి.నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇకపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడతామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సహకరించాలని కోరారు.


శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



సీఐ శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటి వరకు సీఐగా విధులు నిర్వహించిన ఎల్.భాస్కరరావు బదిలీపై వెళ్లడంతో, ఆయన స్థానంలో శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.

'ఈపీఎఫ్ పెన్షనర్ల దీక్షలను విజయవంతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న గజేంద్రరావు, సత్యనారాయణ

అగనంపూడి: ఈపీఎఫ్ పెన్షనర్ల ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న రిలే దీక్షల్లో పెద్ద ఎత్తున పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని అగనంపూడి ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం నాయకులు గుదే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ కోరా రు. అగనంపూడి సీడబ్ల్యూసీలో శుక్రవారం నిర్వహించిన విశాఖ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న రిలే దీక్షా శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మరిశా రామచంద్రరావు, సాయిన సన్యాసిరావు, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, డొక్కా రమేష్, ఎం.మస్తాన్‌రెడ్డి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సత్కారం



డాక్టర్ భారతిని సత్కరిస్తున్న అగనంపూడి మహిళా సంఘాల నేతలు

అగనంపూడి: ఉత్తమ సేవలకు గాను కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్న అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతిని అగనంపూడికి చెందిన మహిళా సంఘాలు ఘనంగా సత్కరించాయి. అగనంపూడి ఆస్పత్రికి జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన డాక్టర్ భారతి సేవలను అగనంపూడి బొర్రమాంబ పారాయణ సేవా సమితి అధ్యక్షురాలు చిత్తా జానకీదేవి, కార్యదర్శి శోభారాణి కొనియాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు లలిత, పద్మ, పద్మ, చంద్రకళ, శిరీష, సత్యవతి, లక్ష్మి, మహాత్మా గాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు ఘనంగా సత్కరించారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్‌కు డిమాండ్



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్, టెలికాం, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ చేయాలని స్టీల్ సీఐటీయు కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం కార్మికుల బకాయిల గురించి పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్ల బిల్లుల నుంచి ప్రతీ నెలా ఫుల్ అండ్ ఫైనల్ కోసం రికవరీ చేసే సొమ్మును కార్మికులకు యాజమాన్యమే చెల్లించాలన్నారు. ఈ అంశంపై యాజమాన్యం సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఒ.వి.రావు, ఎస్.రమణ, జి.శ్రీనివాస్, సోమేష్, కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యప్రదాయిని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి

- అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి
- ఆస్పత్రిలో బ్రాకీ థెరపీ యూనిట్ ప్రారంభం



ఆస్పత్రిలో బ్రాకీ థెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న అనకాపల్లి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అగనంపూడి: క్యాన్సర్ రోగుల పాలిట ఆరోగ్య ప్రదాయినిగా అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం నిలుస్తోందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అన్నారు. అగనంపూడిలోని ఆస్పత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన బ్రాకీ థెరపీ సూట్ బ్లాక్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడిన ఎంతో మందికి ఈ ఆస్పత్రి వరప్రదాయినిగా నిలిచి, సేవలందించడం జిల్లాకే గర్వకారణమన్నారు. సేవలు అందిస్తున్న వైద్యులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను, అక్కడి వసతులను పరిశీలించారు. సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ మహంతి, జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్, ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై వైభవంగా నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి తదితరులు

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై శుక్రవారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీనృసింహ స్వామి జన్మ నక్షత్రమైన ప్రతి స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 7గంటల నుంచి హోమాన్ని విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకు వచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్టింపజేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషతల్పంపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తరనామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ విశేషంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు హోమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక : ఈ నెల 17, 18 తేదీల్లో గంగవరంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు శుక్రవారం ఆవిష్కరించారు. మాధవ స్వామి పండగను పురస్కరించుకొని గంగవరం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 16 టీమ్‌లు పాల్గొంటాయని పేర్కొన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ. 15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, నూకరాజు, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ధూమ్‌ధామ్‌గా గాజువాక ఉత్సవ్



ఉత్సవ్‌లో స్టాళ్ల వద్ద రద్దీ

- ఎగ్జిబిషన్ వద్ద పిల్లలు, పెద్దల సందడి
- కనువిందుగా సాంస్కృతిక కార్యక్రమాలు



ఎగ్జిబిషన్‌లో పిల్లల సందడి

గాజువాక: గాజువాక సీతారామ ఉమారామలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం(గాజువాక ఉత్సవ్) శుక్రవారం వైభవంగా జరిగింది. ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గాజువాక బీసీ రోడ్డులో సందడి చోటుచేసుకుంది. ఈ ఉత్సవాల సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఉమారామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహ పాత్రుడు (కేబుల్ మూర్తి), గంధం శ్రీనివాసరావు, మహ్మద్ ఇమ్రాన్, ఉత్సవ కమిటీ సభ్యులు మద్ది శంకర్‌రెడ్డి, దొడ్డి రమణ, గోమాడ వాసు, నాయకులు గంధం వెంకటరావు, తిప్పల రమణారెడ్డి తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు గాజువాక వాసులకు కనువిందు చేశాయి.

ఉక్కు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ధర్నా నేడు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు జనరల్ ఆస్పత్రి వద్ద శనివారం ధర్నా నిర్వహించనున్నామని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి తెలిపారు. స్టీల్ కార్మికులకు హక్కుగా సంక్రమిస్తున్న సౌకర్యాలను కాలరాస్తున్న యాజమాన్యం వైఖరికి నిరసనగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఉక్కు కార్మికులు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

వాసవీ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

అగనంపూడి: అగనంపూడి ప్రాంత వాసవీ క్లబ్, వనితా క్లబ్‌లకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నా రు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. వాసవీ క్లబ్ అధ్యక్షునిగా ఎం.ఎ స్.ఎస్.గురునాథం, కార్యదర్శిగా స్వామి, కోశాధికారిగా వీర్రాజు ఎన్నికయ్యారు. వనితా క్లబ్‌కు అధ్యక్షురాలిగా మహాలక్ష్మి, కార్యదర్శిగా మంగా, కోశాధికారిగా లలితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గవర్నర్ వై.నరసింగరావు, ఎస్. శ్రీను సమక్షంలో కమిటీల ఎన్నిక జరిగింది.

క్షతగాత్రులకు సాయం : రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో జిల్లా గవర్నర్ నరసింగరావు రూ.15వేల నగదు అందించారు. కార్య క్రమంలో ప్రతినిధులు మయూరి బుజ్జి, గణేష్, పెద్దిరాజు, శంకర్, వరహాలశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ'



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతూ, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1086వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో వ్యతిరేకత పెరిగి, బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ అంశంగా మలచే దిశగా కార్మికవర్గం అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.